# ఇంటింటా బీఆర్ఎస్ ప్రచారం



నెహ్రూనగర్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రామంతాపూర్, అక్టోబర్ 10 : ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారు లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ రామంతాపూర్‌లోని నెహ్రూనగర్, శారదానగర్‌లో మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న నాగేశ్వర్‌రావు మంగళవారం కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేశారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని ఉప్పల్ ఎమ్మెల్యేగా బండారు లక్ష్మారెడ్డిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాలకూర శ్రీకాంత్ గౌడ్, ముస్తాక్, పాల్వాయి మధుసూదన్‌రెడ్డి, సంపత్‌రావు, రాజు యాదవ్, సూరంశంకర్, శ్రీనివాస్, కొప్పు నర్సింగ్‌రావు, బుస శంకర్, చాంద్‌పాష, బోసాని పవన్‌కుమార్, శ్రీకాంత్, ప్రశాంత్ గౌడ్, వెంపటి శీను, మద్దురి శ్రీనివాస్, దయాకర్‌రెడ్డి, యాపిల్‌శీను, మారుతి, వనంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, రాధమ్మ, లక్ష్మి, సబితా, మున్న, లడ్డుబాయ్, బాబురావు, మల్లేశ్ యాదవ్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఉప్పల్ అభ్యర్థి బీఎల్ఆర్‌ను సత్కరిస్తున్న ఇందిరాగౌడ్

### బీఎల్ఆర్ గెలుపు ఖాయం

కాప్రా, అక్టోబర్ 10 : ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి భారీ మెజారిటీతో గెలువడం ఖాయమని బీఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు ఇందిరాగౌడ్ అన్నారు. కాప్రాలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా మంగళవారం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్న ఇందిరాగౌడ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితురాలినై పార్టీలో చేరినట్టు తెలిపారు. నాగలక్ష్మి, ప్రకాశ్, శ్రావణ్, స్వప్న, శ్రీమాన్, శేషాచార్యులు, ప్రవీణాచార్యులు, ప్రియదర్శిని, విద్య ఆమెతోపాటు బీఆర్ఎస్‌లో చేరారు.



నగరంలోని ప్రగతి భవన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేస్తున్న కాప్రా డివిజన్ బీఆర్ఎస్ యూత్ నాయకుడు గొగికర్ శివకుమార్ – కాప్రా

## ఎన్నికల నిబంధనలు పాటించాలి

### రిటర్నింగ్ ఆఫీసర్, అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య



ఉప్పల్, అక్టోబర్ 10 : ఎన్నికల నిబంధనలు పాటించి, అధికారులకు సహకరించాలని ఉప్పల్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. ఉప్పల్ మున్సిపల్ కార్యాలయంలో ఎన్నికల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో తనిఖీలు, పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారులను నియమించామని, ప్రతిఒక్కరూ బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఎన్నికల సందర్భంగా ఓటరు లిస్టులు ప్రకటించామని, పేర్లు లేనివారు తగిన ఆధారాలతో మళ్లీ ఓటు హక్కుకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల్లో 80 ఏండ్ల పైబడిన వృద్ధులకు బ్యాలెట్ ఓటింగ్‌కు అవకాశం ఉంటుందని, వికలాంగులు, అనారోగ్యంతో ఉన్నవారికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. సభలు, సమావేశాలకు అనుమతులు తీసుకోవాలని, డబ్బు, మద్యం సరఫరాపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా ప్రజలు, పార్టీలు సహకరించాలని కోరారు. ఫిర్యాదులను సీవిజిల్ యాప్ ద్వారా చేయవచ్చని, టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మేనేజ్‌మెంట్ సైన్స్‌లో భాగ్యలక్ష్మికి డాక్టరేట్



మల్లాపూర్, అక్టోబర్ 10 : ఉప్పల్ నియోజకవర్గం మీర్‌పేట్ మౌలాలి హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన కరిపె భాగ్యలక్ష్మి మేనేజ్‌మెంట్ సైన్స్‌లో డాక్టరేట్ పట్టా పొందారు. సీబీఐటీ ఇంజినీరింగ్ కాలేజ్- స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న భాగ్యలక్ష్మికి జేఎన్‌టీయూ హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి మేనేజ్‌మెంట్ సైన్స్ విభాగంలో (డాక్టరేట్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టా పొందారు. ఈ సందర్భంగా సోదరుడు కరిపె ప్రవీన్ వంజరి కుటుంబసభ్యులు భాగ్యలక్ష్మిని అభినందించారు.

## ఆర్థిక సాయం

చర్లపల్లి, అక్టోబర్ 10 : చర్లపల్లి డివిజన్ అంబేద్కర్ కాలనీకి చెందిన వ్యక్తి మృతి చెందడంతో బీఆర్ఎస్ పార్టీ, బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు పది వేల ఆర్థిక సాయం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ట్రస్ట్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ, బీఎల్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతోపాటు పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు పార్టీ అభ్యర్థి అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు ఎంకిరాల నర్సింహ, కాలనీ అధ్యక్షుడు అబ్బయ్య, బీఏ.పాల్, నరేశ్ రద్రాక్ష బాల్‌రాజు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు, బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు

## అగ్ని ప్రమాదంలో టైలర్ షాపు దగ్ధం

**రూ.7లక్షల మేర ఆస్తినష్టం.. న్యాయం చేయాలని కోరిన బాధితుడు**

మన్సూరాబాద్, అక్టోబర్ 10 : టైలరింగ్ షాపులో చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో సుమారు రూ.7లక్షల మేర ఆస్తినష్టం సంభవించింది. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. బాధితుడి కథనం ప్రకారం.. మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని హనుమాన్ దేవాలయం పక్కన రెండున్నర సంవత్సరాలుగా ఇంజాపూర్‌కు చెందిన నారాయణరెడ్డి సుప్రీం పేరుతో టైలర్ షాపును నడుపుతున్నాడు. యథావిధిగా సోమవారం రాత్రి 10:30 గంటలకు షాపును మూసి వేసి ఇంటికి వెళ్లిపోయాడు. మంగళవారం ఉదయం మన్సూరాబాద్‌కు చెందిన లక్ష్మారెడ్డి టైలర్ షాపు నుంచి పొగలు రావడాన్ని గమనించి నారాయణరెడ్డితోపాటు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చాడు. సిబ్బంది చేరుకునేలోపే షాపులో ఉన్న సామగ్రి పూర్తి దగ్ధమయ్యింది. షాపులో ఉన్న సుమారు రూ.7లక్షల విలువైన ఖాజా మిషన్, బటన్స్ మిషన్, రెండు స్టిచ్చింగ్ మిషన్స్, ఓవర్‌లాక్ మిషన్, టైలరింగ్ మెటీరియల్, దసరా పండుగ సందర్భంగా విక్రయించేందుకు తీసుకువచ్చిన రూ. 2.50 లక్షల విలువ చేసే కొత్త బట్టలు, కస్టమర్స్‌కు చెందిన రూ.లక్ష విలువైన బట్టలు పూర్తిగా దగ్ధమయ్యాయి. తీవ్రంగా నష్టపోయాయని తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు. విషయాన్ని తెలుసుకున్న మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని దగ్ధమైన టైలర్ షాపును పరిశీలించాడు. బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని తెలిపాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## టూవీలర్స్ మెకానిక్స్ సమస్యలు పరిష్కరిస్తా



సైనిక్‌పురిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఎల్ఆర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కాప్రా, అక్టోబర్ 10 : ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని టూవీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్ షాప్స్, డెంటింగ్ అండ్ పెయింటింగ్ వర్క్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం సైనిక్‌పురిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని, ఆయన సోదరుడు నీలంరెడ్డిని నియోజకవర్గం పరిధిలోని టూవీలర్ మెకానిక్స్, ఆటోమొబైల్ షాప్స్, డెంటింగ్ పెయింటింగ్ వర్క్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. తమ అసోసియేషన్ కార్యకలాపాల కోసం కొంత స్థలం కేటాయించాలని వారు బీఎల్ఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నరేందర్ యాదవ్, కోశాధికారి మహిపాల్‌రెడ్డి, సలహాదారులు వి.ప్రతాప్‌చారి, ఉపాధ్యక్షులు జైపాల్‌రెడ్డి, ఎం.నరసింహ యాదవ్, జాయింట్ సెక్రటరీ ఎ. మహేందర్‌చ్చారి, మహేశ్, ప్రతాప్‌రెడ్డి, గణేశ్, నాగరాజు, శివ, సంతోష్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలి

హయత్‌నగర్, అక్టోబర్ 10: డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలని రంగారెడ్డి జిల్లా ఎంప్లాయిమెంట్ నేషనల్ కెరీర్ స్కీమ్ యంగ్ ప్రొఫెషనల్ కె.విజయ కుమార్ సూచించారు. మంగళవారం హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కళాశాల కెరీర్ గైడెన్స్, కాంపిటీటివ్ సెల్ ఆధ్వర్యంలో ''ఆన్‌లైన్‌లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు'' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా ఎంప్లాయిమెంట్ నేషనల్ కెరీర్ స్కీమ్ యంగ్ ప్రొఫెషనల్ కె.విజయ్ కుమార్ విచ్చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్‌లో ఇంటర్నెట్ ద్వారా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలో, జాబ్ పోర్టల్‌లో ఏవిధంగా పేరు నమోదు చేసుకోవాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు ఏవిధంగా వెతికి దరఖాస్తు చేసుకోవాలని, ఎక్కడెక్కడ ఎన్ని ఉన్నాయో తెలుసుకోవాల్సిన సమగ్ర సమాచారంపై విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఆధునిక కాలంలో ఏవిధంగా సమాచారం వెతకాలో, ఉద్యోగ అన్వేషణ ఎలా చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోత్స్నప్రభ అధ్యక్షత వహించగా కెరీర్ గైడెన్స్, కాంపిటీటివ్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసులు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఇంతియాజుద్దీన్ ఫారూఖీ, డాక్టర్ జాహెదాబేగం, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ డీవీ రావు, అమరేందర్‌రెడ్డి, ఆవేస్ మొయుద్దీన్, విద్యార్థులు పాల్గొన్నారు.




అవగాహన సదస్సులో పాల్గొన్న నేషనల్ కెరీర్ స్కీమ్ యంగ్ ప్రొఫెషనల్ కె.విజయకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోత్స్నప్రభ

## నేడు బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం

వనస్థలిపురం, అక్టోబర్ 10 : రాజ్యాధికారం, బీసీలు అనే అంశంపై బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు బీసీ కులాల సమన్వయ వేదిక అధ్యక్షుడు బొమ్మ రఘురాం నేత ఒక ప్రకటనలో తెలిపారు. వనస్థలిపురంలో ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని పార్టీలు బీసీలకు సముచిత న్యాయం ఇవ్వాలని కోరారు.